మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు
- జగన్ 2.0 ప్రభుత్వంలో అన్ని లెక్కలు తేలుస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాల్గొన్న నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులు

ఆత్మకూరురూరల్: చంద్రబాబు ఏడాది పాలనలో హామీలను అమలు చేయకుండా మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయడమే ఆయన పాలనగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. నిబంధనల పేరుతో తల్లికి వందనం పథకాన్ని కొందరికే అమలు చేశారని, అది కూడా రూ.13 వేలు మాత్రమే జమ చేయడం మోసం కాదా అని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక ఏడాది పాటు ఎగ్గొట్టి అరకొరగా ఇవ్వడం మోసం కాదా అన్నారు. బస్సులు పెంచకుండానే ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జగన్ హయాంలో 17 మెడికల్ కళాశాలలు తెస్తే తాము ప్రచారం చేసుకోలేదని, అందులో 10 మెడికల్ కళాశాలలు తాను కట్టానంటూ చంద్రబాబు పచ్చ మీడియాతో ప్రచారం చేయించుకుంటున్నారన్నారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాం నుంచి జిల్లాలో రెండు కార్ల పంటలకు సాగునీరు అందిస్తుండగా ఆ ఘనత తమదేనంటూ ప్రస్తుత పాలకులు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. తనపై 14 అక్రమ కేసులు పెట్టి 96 రోజులు జైలులో పెట్టారని, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి మీద జిల్లా రౌడీమూకలు దాడులు చేస్తే పోలీసులు కనీసం స్పందించలేదన్నారు. పైగా ప్రసన్నతో పాటు చలపతి, మొయిళ్ల గౌరీ తదితరుల మీద అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇటీవల సంగం మండలం పెరమన వద్ద అక్రమ ఇసుక రవాణా చేసే టిప్పర్ ఢీకొట్టి ఏడుగురు చనిపోతే ఆ కేసును నీరుగార్చేలా అక్కడి సీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోలీసు అధికారుల చిట్టా తయారు చేసి జగన్ 2.0 ప్రభుత్వంలో అంతు చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకుడు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర మహిళా జోనల్ విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టొద్దు

ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టడం సరికాదని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. 2004 ఎన్నికల్లో జలయజ్ఞం చేపట్టిన వైఎస్సార్ 2009 ఎన్నికల్లో కేవలం రెండు హామీలతో అధికారం చేపట్టారన్నారు. ఒక్కటి ఫీజు రీయింబర్స్‌మెంట్, రెండోది సోమశిల హైలెవల్ కెనాల్ మాత్రమేనన్నారు. అప్పట్లో నరసరావుపేట ఎంపీగా ఉన్న తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే మాగుంట మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌కు చేసిన వినతి మేరకు ఈ బృహోత్తర కార్యక్రమం మొదలైందన్నారు. అయితే ఆయన మరణానంతరం వైఎస్సార్ ఆప్త మిత్రుడు కేవీపీ రామచంద్రరావు ప్రత్యేక చొరవతో ఈ పథకానికి అంకురార్పణ జరిగిందన్నారు. తరువాత కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా ఉన్న వ్యక్తి నిబంధనల ప్రకారం సంతకం చేశారన్నారు. అంతమాత్రం అంతా తానే అన్నట్లు వ్యవహరించడం తగదన్నారు. సోమశిల గేట్లు ఎత్తి నీరు విడుదల చేశామని పదేపదే చెప్పుకోవడం చూస్తే జాలి వేస్తోందన్నారు. అప్పట్లో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న అనిల్‌కుమార్ యాదవ్ సూచనలు, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మంత్రి హోదాలో ఉన్న గౌతమ్‌రెడ్డి అనుమతితో సోమశిల గేట్లు ఎత్తిన విషయం మరువరాదన్నారు. నారంపేట పారిశ్రామికవాడకు 300 ఎకరాలకుపైగా భూసేకరణ చేయడంతో పాటు రూ.50 కోట్లకుపైగా ఖర్చు చేసి అభివృద్ధి చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి, మేకపాటి కుటుంబానికి దక్కుతుందన్నారు. అక్కడ ఏర్పాటు చేయాల్సిన సెంచూరి ఫ్యాక్టరీ ఆత్మకూరు నియోజకవర్గానికి అనుకుని ఉన్న గోపవరం వద్దకు తరలించారని మాట్లాడుతున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో ప్రత్యేక కారణాలు వల్ల అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసింది వాస్తవమన్నారు. ఆ విషయాన్ని తప్పుబట్టేవారు ఇప్పుడు సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నంతగా ఆత్మకూరు నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు తీసుకొస్తే తానే వచ్చి నమస్కరిస్తానన్నారు. మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయానికి తాము ఇచ్చిన భూమికి బదులుగా 75 ఎకరాలు ప్రభుత్వం నుంచి పొందామని చెప్పే వారు వాటిని నిరూపించాలని నిలదీశారు. రూ.200 కోట్ల విలువైన ఉదయగిరి మెరిట్స్ ఇంజినీరింగ్ కాలేజీని వ్యవసాయ కళాశాల కోసం ప్రభుత్వానికి అందజేసిన ఘనత మేకపాటి కుటుంబానికి దక్కుతుందన్నారు. ఏడాదిన్నర కాలంలో ఆత్మకూరు చెరువులో 3 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అధికారం అడ్డంపెట్టుకొని సొమ్ము చేసుకున్నారని, మర్రిపాడులో రూ.కోట్ల విలువైన ఇసుక గుట్టలను, చేజర్లలో ఖరీదైన జామాయిల్ కర్రను స్వాహా చేసిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకుల అభీష్టాలకు అనుగుణంగా పార్టీ నడుస్తోందని స్పష్టం చేశారు. పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, ఆత్మకూరు లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు, ఎంపీపీలు పెయ్యల సంపూర్ణమ్మ, గంగవరపు లక్ష్మీ శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పులిమి వెంకటరమేష్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, తదితరులు ప్రసంగించగా, వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు చిట్టమూరు జితేంద్రనాగిరెడ్డి, చెన్ను వెంకటేశ్వర్లురెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, బోయిళ్ల మాలకొండారెడ్డి, పులగం శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్ ట్రెజరీ కార్యాలయానికి కుర్చీల వితరణ



ఉదయగిరి: ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయానికి విశ్రాంత ఉద్యోగుల ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి అధ్యక్షుడు ఖాదర్‌బాషా రూ.6 వేలు విలువ చేసే కుర్చీలను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా సబ్ ట్రెజరీ అధికారి ఉస్మాన్ దాతను అభినందించారు.

నర్రవాడ పీహెచ్‌సీలో తహసీల్దార్ తనిఖీ



దుత్తలూరు: మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ యనమల నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిసరాలు, మందుల గది, కాన్పుల గదిని పరిశీలించారు. రిజిస్టర్లు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం ఎలా అందుతుంది, సక్రమంగా మందులు అందిస్తున్నారా, సిబ్బంది వస్తున్నారా వంటి విషయాలను ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మనోజ్ఞ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



ఉదయగిరి: ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను స్థానిక కార్యాలయంలో సీడీపీఓ పుణ్యవతి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న తొమ్మిది ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. వారిలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.

బీఎల్వోలతో సమావేశం



వరికుంటపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల చెంచయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీల బీఎల్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 నాటి ఓటర్ల జాబితా, ప్రస్తుత ఓటర్ల జాబితాను వెరిఫికేషన్ చేయాలని, ముఖ్యంగా ప్రస్తుత జాబితాలో 35 ఏళ్లు పైబడిన వారు 2002 నాటికే ఓటర్ల జాబితాలో ఉన్నారా.. లేదా? అనే పూర్తి వివరాలను సేకరించి సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ హర్షద్ పాల్గొన్నారు.

వింజమూరు బాలికల ప్రతిభ



వింజమూరు(ఉదయగిరి): అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో వింజమూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపారు. తూర్పు గోదావరి జిల్లా జట్టుతో జరిగిన హోరాహోరీ పోటీలో గెలుపొంది రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా సెపక్ తక్రా చైర్మన్ సుకుమార్, కోచ్ ప్రకాశ్ వారికి మంగళవారం అభినందనలు తెలిపారు. పాఠశాల పీడీ రజినీ విలాసిని, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రతిభ కనపర్చిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.345

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.345 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 958 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 620 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 338 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.345, కనిష్ట ధర రూ.90 పలుకగా, సరాసరి రూ.220.64 లభించిందన్నారు. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

అనుమసముద్రంపేట: మహిళలు ఆరోగ్యంగా ఉండడమే వైద్యశాఖ లక్ష్యమని చిరమన పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతిరాణి అన్నారు. చిరమన ప్రభుత్వ వైద్యశాలలో స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే బలమైన కుటుంబాలు ఏర్పడుతాయన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్యసేవలు అందించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.నాగవినూత, పి.సుమిత్ర వర్ధిని, కె.సుబ్రహ్మణ్యం, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- **కలిగిరి:** కేంద్ర ప్రభుత్వం మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వైద్యాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. కృష్ణారెడ్డిపాళెంలో స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ మాలకొండయ్య, వార్డు సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- **ఉదయగిరి రూరల్:** మండలంలోని నేలటూరులో గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి శివకల్పన 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కేంద్ర ప్రభుత్వం మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
- **దగదర్తి:** మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వారికి తగిన ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు దగదర్తి పీహెచ్‌సీ వైద్యురాలు టి.అలేఖ్య అన్నారు. స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉలవపాళ్ల సచివాలయంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్ ఆఫీసర్ కొండారెడ్డి, డీహెచ్ఓ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్.విజయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- **అల్లూరు:** స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రక్తపోటు, మధుమేహం, వివిధ రకాల కేన్సర్, క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు, డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.
- **సీతారామపురం:** మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి స్వప్నరెడ్డి అన్నారు. ఆమె మంగళవారం నెమళ్లదిన్నె గ్రామంలో నిర్వహించిన స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. అనంతరం మహిళలకు బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచ్ రామచంద్ర, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు బంగ్లా సెంటర్‌లో ఉన్న హబీమున్నీసా తన ఇంటిపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఇంట్లోని వస్తువులను బయటపడేసి ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా దౌర్జన్యం చేశారని ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని 20 మంది వ్యక్తులు తన భర్త ఖాదర్‌బాషా ప్రోద్బలంతో ఇంట్లోకి ప్రవేశించి దౌర్జన్యం చేసినట్లుగా తెలిపారు. గతంలో కూడా ఇలానే జరిగిందని, దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. తన ఇంటిపై పదే పదే గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేస్తున్నా పోలీసుల వైపు నుంచి తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

ఉదయగిరి: ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ నాయీ బ్రాహ్మణులు తహసీల్దార్ ఎల్.రామ్మోహన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరుతో పాటు ప్రకాశం, కడప జిల్లాలకు సరిహద్దుగా ఉన్న ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో వలసలు నివారించాలన్నా, అభివృద్ధి చెందాలన్నా ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేసుకోవడమే ఏకైక మార్గమన్నారు. ఉదయగిరిలో ఎనిమిది మండలాలు ఉండగా అవి మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కలిసి ఉన్నాయన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలలోని 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.ప్రసాద్, ఎం.శ్రీనివాసులు, జి.నారాయణ, శీను,తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోపు గృహ నిర్మాణాలు పూర్తి



సీతారామపురం: పక్కా గృహ లబ్ధిదారులు నిర్మాణ పనులను మార్చిలోపు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ పీరాన్ అన్నారు. ఆయన సీతారామపురం అరుంధతీయవాడలో పక్కా గృహాల నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తున్నందున నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. మండలంలో 630 పక్కా గృహాలు మంజూరు కాగా కేవలం 154 మాత్రమే పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశలో ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయించాలన్నారు. ఆయనతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సత్కారం



రమేష్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

కావలి(అల్లూరు): గత శుక్రవారం కావలి వైకుంఠపురంలో పాడుబడిన బావిలో పడిన తల్లీ, కుమార్తెలను రక్షించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు పొట్లూరి రమేష్‌ను కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి కుటుంబానికి పెద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి పరామర్శ



రామిరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి

కావలి (అల్లూరు): మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని కావలిలోని స్వగృహంలో తాడిపర్తి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. రామిరెడ్డిపై కక్ష పూరిత రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. గతంలో ఇలా లేదని ఈ ప్రభుత్వంలోనే కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని ప్రజలే మాట్లాడుకుంటున్నారన్నారు.

జీతాలు చెల్లించాలని ఆందోళన



వైద్యశాల ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తమ జీతాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అరకొరగా చెల్లించే జీతాలు కూడా నెలనెలా ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు అప్పు తెచ్చుకుందామన్నా ఎవరూ ఇవ్వడం లేదని వాపోయారు. ఫలితంగా తాము ఎంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి వద్దే ఉపాధి పేరిట మోసం

ఉదయగిరి రూరల్: పెన్సిళ్ల తయారీ పేరుతో ఇంటి వద్దే ఉపాధి పొందవచ్చని యూట్యూబ్‌లో చూసి ఓ యువకుడు మోసపోయిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి మండలం వెంగళరావునగర్ గ్రామానికి చెందిన షేక్.అమీల్‌సొహైల్ అనే యువకుడు ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీన యూట్యూబ్‌లో నటరాజ్ పెన్సిళ్లను ఇంటి వద్ద తయారు చేసి తమకు పంపిస్తే నగదు ఇస్తామని, అందుకు ముందుగా తయారీకి అవసరమైన ముడి సరుకు కోసం కొంత నగదు చెల్లించాలని వారు సూచించారు. దీంతో ఆ యువకుడు ఫోన్‌పే ద్వారా రూ.30 వేలు నగదు చెల్లించాడు. తరువాత వారి నుంచి ఎలాంటి సమాధానం, సమాచారం లేకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఆ యువకుడు ఎస్సై ఇంద్రసేనారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశాడు.

తూ.కొ అధికారుల దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి మొహిసిన్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని పలు దుకాణాలను జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కొలతల్లో తేడాలున్న దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా తు.కొ అధికారి షేక్ మొహిసిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన జీఎస్టీని అమలు చేయాలన్నారు. పాత ధరలకు విక్రయించి వినియోగదారులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాటాలున్న ప్రతిఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ తమ కాటాలకు ముద్రలు వేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు సాగించాలని సూచించారు. చికెన్, కూరగాయల దుకాణ యజమానులు కాటాలకు లైసెన్సులు తీసుకోవాలన్నారు. అయితే వీరి రాకను గమనించిన కొంత మంది యజమానులు ముందుగానే షాపులు మూసివేశారు.

పొగాకు సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



పొగాకు నారుమడులను పరిశీలిస్తున్న అధికారులు

కలిగిరి: పొగాకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలం కేంద్రం పరిధిలోని పార్లపల్లి, కొండాపురం, కృష్ణారెడ్డిపాళెం, కుడుములదిన్నెపాడు గ్రామాల్లో నారుమడులను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేకుండా నర్సరీలు, నారుమడులను వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పొగాకు సాగు చేసే రైతులు అధికారుల సూచనల మేరకు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రాధికారి ఎస్.సంతోష్‌కుమార్, క్షేత్ర సహాయకులు హజరత్‌బాబు, వెంకటేష్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. జగన్మాతా

శరన్నవరాత్రి ఉత్సవాలు కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండో రోజు మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఉదయగిరిలో గాయత్రీదేవిగా పార్వతీదేవి



దుత్తలూరు: నర్రవాడలో గాయత్రీదేవిగా రేణుకా ఎల్లమ్మ



కలిగిరి: తెల్లపాడులో గాయత్రీదేవిగా భద్రకాళి



సీతారామపురం: సిద్ధేశ్వరంలో ఇష్టకామేశ్వరిగా బాలాత్రిపురదేవి



ఆత్మకూరురూరల్: కాశీనాయన ఆశ్రమంలో ధనలక్ష్మిగా గాయత్రీదేవి